క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులే టార్గెట్టా..



కూనవరం పంచాయతీలో సెలవు రోజున పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది

ఉప్పలగుప్తం: ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులకు టార్గెట్ పెట్టడంతో వారు సతమతమవుతున్నారు. యోగాంధ్రలో ఉప్పలగుప్తం మండలం వెనుకబడి ఉండటంతో ఉన్నతాధికారులు ఒత్తిడి మేరకు సెలవు దినాల్లో సైతం పని చేయాల్సిన పరిస్థితి సచివాలయ ఉద్యోగులకు వచ్చింది. శనివారం బక్రీద్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా సెలవు దినాన్ని ప్రకటించింది. అయినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాలతో సిబ్బంది నిర్వర్తించాల్సి వచ్చింది. ఈ అనధికార విధులకు మండలంలో ఆయా చోట్ల పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరవుతూ సచివాలయ ఉద్యోగులపైనే పని ఒత్తిడి పడేస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



కూనవరంలో ఉపాధి కూలీల మస్టర్లను పరిశీలిస్తున్న సర్పంచ్ ఈశ్వరి

ఉప్పలగుప్తం: ప్రస్తుత వాతావరణంలో ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి సూచించారు. మండలంలోని కూనవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు పలు సూచనలు చేసి, ఉపాధి మస్టర్లను పరిశీలించారు. ఉపాధి కూలీల వేతనాలు జమ కావడం లేదని వేతనదారులు సర్పంచ్‌కు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బి.దేవానందం తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

అమలాపురం రూరల్: ప్రధాని మోదీ పాలనలో దేశానికి సంక్షేమం వచ్చిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ అన్నారు. అమలాపురంలోని ముమ్మిడివరం గేట్ సత్యనారాయణ విలాస్‌లో శనివారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన 11 ఏళ్ల మోదీ పాలనపై జిల్లా పార్టీ నాయకుల సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా ఇన్‌చార్జ్ పాట్నూరు రామ్మోహనరావు, కిసాన్ మోర్చా కార్యవర్గ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జ్ ఎస్.లక్ష్మీప్రసన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరు సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



ముమ్మిడివరంలో యోగా శిక్షణలో మహిళా సమాఖ్య సభ్యులు

ముమ్మిడివరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముమ్మిడివరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం మండల మహిళా సమాఖ్య ఏపీఎం రమణ ఆధ్వర్యంలో యోగా శిక్షణ జరిగింది. యోగా టీచర్ రాంబాబు పర్యవేక్షణలో ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, తదితర అంశాలను వివరించారు. సీసీ ఎం.లక్ష్మి, వి.భవానీ, సమాఖ్య అధ్యక్షురాలు ఆర్.శ్యామల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జూదరులను అరెస్ట్ చేయాలి

యానాం: స్థానిక కొత్త బస్టాండ్ మున్సిపాల్ లాడ్జిలో ఈ నెల 2న అర్ధరాత్రి పేకాట క్లబ్‌పై అధికారులు దాడి ఘటనకు సంబంధించి నిందితులు, నిర్వాహకులపై ఇప్పటివరకూ పోలీస్ శాఖ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై శనివారం పలువురు పుదుచ్చేరి ఉన్నత పోలీస్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు సుమారు వంద మంది జూదరులు రూ.లక్షల్లో చేతులు మార్చుతూ యథేచ్ఛగా పేకాట ఆడుతున్నప్పటికీ కేవలం పదడుగుల దూరంలో పోలీస్ స్టేషన్ ఉన్నా స్పందించ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎండ ప్రతాపం!



గొల్లవిల్లిలో కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్న మెయిన్‌రోడ్డు



ఉప్పలగుప్తంలో ఎండకు తలపై ముసుగు వేసుకుని వెళ్తున్న మహిళలు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కబోతతో అల్లాడుతున్న జనం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ఉప్పలగుప్తం: భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు.. రోజురోజుకూ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.. ఉక్కబోతతో సెగలు పుట్టిస్తున్నాడు.. ఈ ఏడాది ఎండాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరాయి. నెల రోజులుగా వాతావరణంలో మార్పులతో మధ్య మధ్యలో అకాల వర్షాలతో వాతావరణం చల్లబడడంతో కొద్దిగా ప్రజలు హమ్మయ్యా అనుకున్నారు. రోహిణి కార్తె మొదలై 15 రోజులు గడిచి ముగింపు దశకు చేరుకున్నా పది రోజులుగా ఎండ తీవ్రతకు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రచండ భానుడు తన ప్రతాపం చూపటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్ని రోజులుగా రేయింబవళ్లు ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే రికార్డు స్థాయిలో ఎండలు, వడగాడ్పులు పెరగడంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల ప్రాంతాల్లో బయటకు రావడానికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే పెళ్లిళ్ల సీజన్, పాఠశాలలు తెరిచే సమయం కావడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ప్రస్తుత సమయంలో వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు ఎండ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

రోడ్లన్నీ నిర్మానుష్యం

ఎండ తీవ్రతకు కొన్నిచోట్ల రోడ్లపై జన సంచారం నిలిచిపోయి, వర్తకులు షాపులు మూసివేయడంతో కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తుంది. ఈ వేడికి ప్రజలు ఏసీలకు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. వ్యవసాయ పనులకు కూలీలు, రైతులు నానా హైరానా పడుతున్నారు. గతంలో ప్రధాన సెంటర్లు, కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ అవి కొన్ని రోజులు మాత్రమే అలంకార ప్రాయంగా పనిచేశాయి. రోడ్ల వెంబడి పానీయాలు, పండ్లతో చిరు వ్యాపారాలు సాగించే వర్తకులకు ఆదరణ పెరిగినప్పటికీ, ఎండ వేడి తట్టుకోలేక వ్యాపారాలు చేయలేకపోతున్నామని పలువురు అంటున్నారు. దీంతో వారూ ఇళ్లకే పరిమితం అవుతున్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఉదయం 35 నుంచి 44, రాత్రి వేళల్లో 26 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. ఈ ఉష్ణోగ్రతలో తిరిగితే వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో అవసరమైతే తప్ప బయట రావొద్దు. ప్రస్తుత పరిస్థితిలో ఉదయం 10 గంటలకే పనులు ముగించుకుని సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. అత్యవసరంగా ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు వెంట తాగునీరు, మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కొబ్బరి నీళ్ల వంటివి తీసుకెళ్లాలి. మెత్తని గాలి తగిలే దుస్తులను ధరించాలి. బయటకు వెళ్లే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చే ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను నీటిలో కలుపుకుని తరచూ తాగాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రాంతానికి తీసుకు వెళ్లి, తడి వస్త్రంతో ముఖం తుడిచి దగ్గరలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించాలి.

– బాల సుబ్రహ్మణ్యం, పీహెచ్‌సీ వైద్యాధికారి, బెండమూర్లంక, అల్లవరం మండలం

ఇలా చేద్దాం..

మానవ శరీరంలో ఐదు లీటర్ల మేరకు నీరు ఉంటుంది. శరీరంలో జరిగే జీవక్రియలన్నింటికీ ఇది అత్యవసరం. ఉష్ణోగ్రత 37 డిగ్రీలు దాటినప్పుడు శరీరంలో ఉన్న లవణాల సంఖ్య తగ్గిపోతుంది. ఆ సమయంలో శరీరం చల్లబడేందుకు చర్యలు తీసుకోవాలి. అధిక ఉష్ణోగ్రతలకు వడదెబ్బ తగలకుండా చల్లని తాగునీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, చల్లని పానీయాలు వంటివి తరచూ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా రక్షణ చర్యలు పాటించాలి. తలకు క్యాప్, ముఖానికి మాస్క్ ధరించడం ముఖ్యం. ఎండ ఎక్కువగా ఉంటే సాధ్యమైనంత వరకూ ఇంటి పట్టున ఉంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరగడం అందరినీ హడలెత్తిస్తుంది. ఇంకెన్ని రోజులు ఈ ఎండ అని అంటున్నారు.

వడదెబ్బ లక్షణాలు

శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. వణుకు పుట్టడం, తలనొప్పి, తల తిరగటం, శరీరంలో ఉన్న నీరు బయటకు పోవటంతో ఎండిపోయిన చర్మంతో జ్వరం రావటం, నిద్ర మత్తుగా పట్టడం, బీపీ పూర్తిగా తగ్గిపోవటం, మూత్రం స్తంభించడం వంటి సమస్యలను ఎదుర్కొంటారని వైద్యులు వెల్లడిస్తున్నారు.

బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ వద్దు



ఎంఈఓ ఏడుకొండలుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు



అమలాపురం ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

అల్లవరం: ఉపాధ్యాయుల బదిలీల్లో మాన్యువల్ విధానాన్ని అనుసరించి పారదర్శకంగా బదిలీలు జరపాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాన్యువల్ విధానాన్ని అనుసరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ-2 ఏడుకొండలుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శివకుమార్, తోట బాలకృష్ణ, ఎస్‌వీపీజీ నాయుడు, కేఎస్‌వీ సత్యనారాయణ, జీబీ వెంకటేశ్వర్లు, కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి

అమలాపురం రూరల్: సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ అమలాపురం ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించడం కష్టమంటూ అధికారులు ప్రకటనలు చేయడం దారుణమని, ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక నాయకులు సరిదే సత్య పల్లంరాజు, నరేష్, మొయినుద్దీన్, నందెపు శ్రీనివాస్, నాగేంద్రగౌడ్, పెన్నాడ శ్రీనివాస్, కొమ్ముల సత్యరమేష్, మోటూరి శ్రీనివాస్, కొప్పిశెట్టి మేరీమాత, సత్యభాను పాల్గొన్నారు.

స్నానాల రేవులను పునరుద్ధరించాలి

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్



డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: పంట కాలువలపై ఉండే పాంచాలను గతంలో స్నానాల రేవులు అనే వారని, అక్కడే పిండ ప్రదానాలు కూడా చేసుకునే వారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు గుర్తు చేశారు. ఇప్పుడు పంట కాలువలపై ఉండే స్నానాల రేవుల్లో కొన్నిచోట్ల పిండి ప్రదానాలు చేయనీయకుండా కొందరు అడ్డుకోవడంపై ఆయన అభ్యంతరం చెప్పారు. అమలాపురం విత్తనాల వారి కాల్వ గట్టులో వాసర్ల గార్డెన్ వద్ద పంట కాలువపై ఉన్న స్నానాల రేవు వద్ద ఇలాంటి వివాదమే అనివార్యమైందన్నారు. దీనిపై స్థానిక కొండిన్య నగర్‌లో విత్తనాల వారి కాల్వ గట్టు ప్రాంతాలకు చెందిన కొందరు సమావేశమై ఈ స్నానాల రేవుపై వస్తున్న వివాదంపై చర్చించారు. స్నానాల రేవు పునరుద్ధరణ కమిటీ ప్రతినిధి డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడారు. విత్తనాల వారి కాలువగట్టుపై స్నానాల రేవును డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి, న్యాయవాది మట్టపర్తి మురళీకృష్ణ శనివారం పునరుద్ధరించినప్పటికీ కొందరు దానిని ధ్వంసం చేయడంపై సమావేశం చర్చించింది. దీంతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో స్నానాల రేవు పునరుద్ధరణను కాంక్షించే వారంతా అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను కలసి శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. సమావేశంతోపాటు డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ దొమ్మేటి రాము, డాక్టర్ దుంగ వెంకటేశ్వరరావు, కోనసీమ జేఏసీ ప్రతనిధి కరాటం ప్రవీణ్, కడలి సత్యనారాయణ, బి.సురాజ్, అబ్బిరెడ్డి బాల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే దేశంలో ఐకమత్యం



దొమ్మేటిపేటలో అంబేడ్కర్ విగ్రహం



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్

యానాం: రాజ్యాంగం వల్లే భారత దేశంలో ఐకమత్యం కొనసాగుతుందని కలైమామణి, దక్షిణ భారత దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి అన్నారు. శనివారం నియోజకవర్గ శివారు దొమ్మేటిపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం విష్ణుమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రాజ్యాంగ రచన చేసేటప్పుడు అఖండ ప్రజాస్వామ్య భారత దేశంలో పౌరుల హక్కులు, బాధ్యతలు, నియమ నిబంధనలతో పాటు కుల, మత, జాతి ఇతర వివక్ష లేకుండా అందరికీ న్యాయం, సమానత్వం గురించి స్పష్టం చేశారన్నారు. అంతకు ముందు గౌతమ బుద్ధుని విగ్రహాన్ని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ నేత ఉపాసక ఎస్ఎస్ఆర్ భూపతి ఆవిష్కరించారు. అనంతరం జైభీమ్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్‌ఏఓలు నామాడి అప్పారావు, గిడ్డి బలరామ్, నాయకులు జనిపల్లి వెంకన్నబాబు, మట్టా శ్రీను, పండు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

తాళ్లరేవు: యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ అన్నారు. శనివారం పి.మల్లవరం పంచాయితీ పెదపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అదేవిధంగా నూతన ఆరామంను మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో విజయకుమార్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలని, యువత వ్యసనాల జోలికి పోకుండా విద్యాభివృద్ధే ధ్యేయంగా సాగాలన్నారు. సర్పంచ్ పంపన రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు నాగేంద్రప్రసాద్, ధూళిపూడి వెంకటరమణ, విళ్ల వీర, కుడిపూడి శివన్నారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, నేతల జనార్ధన్, జక్కల ప్రసాద్‌బాబు, కాశి లక్ష్మణస్వామి, వెంటపల్లి వాసంతి తదితరులు పాల్గొన్నారు.

చీకటి... మాటేమిటి



గచ్చకాయలపోర సముద్ర తీరం వద్ద కింద పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

కాట్రేనికోన: ఇదొక ఊరే... అయినా అంతా చీకటే. ఇదేదో మారుమూల అటవీ ప్రాంతం కాదు. కాట్రేనికోన మండలం గచ్చకాయలపోర గ్రామంలో పరిస్థితి. ఇక్కడ సముద్ర తీరం వెంబడి ఉన్న పూరిళ్లకు సుమారు నెల రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేదు. ఈ ప్రాంతంలో 45 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇక్కడ విశాఖపట్నం జిల్లా నక్కపల్లి, అడ్డపుంత, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి చేపల వేట కోసం వలస వచ్చి నివాసం ఉంటున్నారు. 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి కింద పడిపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించాలని అనేక పర్యాయాలు విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో చీకట్లో ఉంటున్నామని అక్కడివారు వాపోయారు. వేసవి ఉక్కబోతకు మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సముద్ర తీరం కావడంతో దోమలు దాడికి విష జ్వరాలు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన పెన్షన్ స్కీమ్ నిబంధనలు విడుదల

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న పాత పెన్షన్ స్థానే నూతన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయడానికి నిబంధనలను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఉద్యోగ విరమణ తర్వాత వృద్ధాప్య ఖర్చులను తీర్చడానికి ఈ పెన్షన్ స్కీమ్ ఉపకరిస్తుందని ఆర్థికంగా ప్రయోజనకరంగా భావిస్తున్నారు. పాత పెన్షన్ పథకం కింద ఉద్యోగుల చివరిజీతంలో 50 శాతం పెన్షన్ ఇచ్చేవారు. దీనితో పాటు ద్రవ్యోల్బణం ప్రకారం పెన్షన్‌లో అనేక సర్దుబాట్లు చేయబడ్డాయి. అయితే ఆర్థిక భారాన్ని చూపి కేంద్ర ప్రభుత్వం 2003లో పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసింది. దీంతో పుదుచ్చేరి ప్రభుత్వం సైతం పాత పెన్షన్ విధానానికి వీడ్కోలు పలికింది. దీంతో నూతనపెన్షన్ విధానాన్ని ఏప్రిల్ 1 ముందస్తు తేదీతో అమలు చేయడానికి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

త్యాగానికి ప్రతీక బక్రీద్



అమలాపురంలో ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న ముస్లింలు



ముమ్మిడివరంలో ముస్లింల ప్రార్థనలు



యానాంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అమలాపురం టౌన్: హజ్రత్ ఇబ్రహీమ్ త్యాగ నిరతికి ప్రతీకగా నిర్వహించే బక్రీద్ పర్వదినం అమలాపురంలో శనివారం ఘనంగా జరిగింది. త్యాగ బుద్ధిని, నిజమైన భక్తి ప్రపత్తులు కలిగి ఉన్న వారే దైవ కృపకు పాత్రులవుతారనే సూక్తిగా అనుగుణంగా ముస్లింలు బక్రీద్‌ను నిర్వహించుకున్నారు. స్థానిక ముల్లా ముస్తాఫా, జామియా, షియా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజ్రత్ ఇబ్రహీమ్ స్ఫూర్తితో అందరూ సాటివారిని ఆదరిస్తూ సహృదయంతో ముందుకు సాగాలని మత పెద్దలు అన్నారు. ఎండీ ఆజామ్, షేక్ అబ్దుల్ ఖాదర్, ఎండీ బషీర్, ఖాదర్ వలీ, మొహిద్దీన్, ఖ్వాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: స్థానిక ముస్లిం వీధిలోని మజ్జిదే జహెరాలో బక్రీద్ పండగ పండగను ఘనంగా జరిపారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రత్యేక నమాజులు చేశారు. దీనికి మామిడికుదురు మండలం నగరం గ్రామం నుంచి విచ్చేసిన మౌలానా మీర్జా అక్బర్ షా బక్రీద్ సందేశాన్ని అందించారు.

యానాం: త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం అని పలువురు అన్నారు. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకుని స్థానిక చారిత్రక జామియా మసీదు, వెంకటరత్నం నగర్‌లోని మసీదాకూబాలో తెల్లవారు జాము నుంచే ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు మహ్మద్ రఫీ, మహ్మద్ యజ్దానీ మాట్లాడుతూ త్యాగమయ జీవితమే మానవజన్మకు సార్థకమన్న అల్లా ఆదేశాలు పాటించడమే బక్రీద్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. అదేవిధంగా యానాం పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు పరస్పరం బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు తాజుద్దీన్‌బాషా, ఎండీ కాలీషా, ఎస్‌కేఎమ్ జిలానీ, బిస్మిల్లా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తల్లి, కొడుకు అదృశ్యం



గంగ, రాజ్‌కిరణ్ (ఫైల్)

యానాం: నియోజకవర్గ శివారు తీర గ్రామం సావిత్రినగర్ న్యూ కాలనీకి చెందిన ఓ తల్లి, చిన్న కుమారుడు అదృశ్యంపై దరియాలతిప్ప అవుట్‌పోస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఏఎస్సై కాలే సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం.. సావిత్రినగర్‌కు చెందిన తల్లి రేకాడి గంగ, ఆమె చిన్న కుమారుడు రాజ్‌కిరణ్‌లు ఈనెల 4న మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని, ఆమె భర్త రేకాడి భైరవస్వామి ఫిర్యాదు చేశారు. గంగ, భైరవస్వామిలకు ముగ్గురు కుమారులు. అయితే భైరవస్వామి పనికి వెళ్లిపోతే ఆ రోజు ఇద్దరు కుమారులను స్కూల్‌లో దింపి అనంతరం చిన్న కుమారుడు రాజ్‌కిరణ్‌ను తీసుకుని రాగా గంగ అదృశ్యమయ్యారు. వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేదని పోలీసులు తెలిపారు.

సీడీపీఓగా రమాదేవి బాధ్యతలు



సీడీపీఓ రమాదేవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సూపర్‌వైజర్లు, ఉద్యోగులు

అమలాపురం రూరల్: ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు సీడీపీఓగా వైకేడీ రమాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాజోలు సీడీపీఓగా పనిచేస్తున్న రమాదేవి బదిలీల్లో భాగంగా అమలాపురానికి వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన వై.విజయశ్రీ యథాస్థానం పి.గన్నవరం రెగ్యులర్ సీడీపీఓగా వెళ్లారు. నూతన సీడీపీఓ రామాదేవిని సూపర్ వైజర్లు, కార్యాలయ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

అమలాపురం టౌన్: అయినవిల్లి తహసీల్దార్ నాగలక్ష్మమ్మపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర వీఆర్వోల సంఘ ప్రచార కార్యదర్శి, జిల్లా సంఘ గౌరవాధ్యక్షుడు మద్దాల బాపూజీ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ దాడిని రాష్ట్ర సంఘంతో పాటు జిల్లా సంఘం కూడా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులపై దాడులు కొనసాగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు చిన్న కేసులు పెట్టి వదిలేయడంతో రెవెన్యూ ఉద్యోగులకు భద్రత లేకుండా పోతోందని ఆయన అన్నారు. ఇలా దాడుల చేసిన వారిపై నాన్ బెయిల్‌బుల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ ఉద్యోగులతా ఏకమై ఇలాంటి దాడులకు వ్యతిరేకంగా పోరాడతామని అన్నారు.

పీఆర్ డీఈఈ రాంబాబుకు పరామర్శ



పీఆర్ డీఈఈ రాంబాబు మాతృమూర్తికి నివాళి అర్పిస్తున్న పలు సంస్థల ప్రతినిధులు

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబును పట్టణానికి చెందిన పలు సంస్థల ప్రతినిధులు శనివారం పరామర్శించారు. రాంబాబు స్వగ్రామం రామచంద్రపురం రూరల్ మండలం ద్రాక్షారామ సమీపంలోని వెలంపాలెం వెళ్లి పరామర్శించారు. ఇందులో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, చాంబర్ సలహాదారు కంచిపల్లి అబ్బులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, గంధం బ్రహ్మానందం తదితరులు ఉన్నారు. రాంబాబు తల్లి దివంగత సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు బహుమతులు

అమలాపురం రూరల్: సవరప్పాలెం శాఖా గ్రంథాలయంలో నెల రోజుల పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సర్పంచ్ సత్తి నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యులు సత్తి ఆదిలక్ష్మి, శ్రీరామ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీగణేష్, గ్రంథాలయ శాఖాధికారి ఎన్‌వీ నాగేశ్వరరావు బహుమతులు అందించారు.